



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 653 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర ఆదివారం 01 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం


# కేజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంతో నా బిడ్డను కోల్పోయాను

-బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి
-విశాఖ విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్ కి మహిళ వినతి
-మహిళ ఫిర్యాదుపై తక్షణం స్పందించిన ఉప ముఖ్యమంత్రి
-సోమవారం బాధిత కుటుంబాన్ని సచివాలయంలోని కార్యాలయానికి దగ్గరుండి తీసుకురావాలని అధికారులకు ఆదేశం



విశాఖపట్నం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : విశాఖపట్నం కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా గర్భంలోనే తన శిశువు మృతి చెందిందని ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించారు. బాధిత మహిళను కుటుంబంతో సహా సోమవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయానికి వెంటబెట్టుకుని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బాధిత మహిళతోపాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి గర్భస్థ శిశువు మృతికి సంబంధించి వివరాలు తెలుసుకుంటారు. శుక్రవారం రాత్రి విశాఖ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా విమానాశ్రయంలో పట్నాల ఉమాదేవి అనే మహిళ పవన్ కళ్యాణ్ ని కలిశారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కాన్పు నిమిత్తం కేజీహెచ్ లో చేరగా.. వైద్యులు, సిబ్బంది తన పట్ల, తన కుటుంబ సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా, ఎంతో అమానవీయంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారు. కాన్పుకి ఇచ్చిన గడువు పూర్తయ్యిందని తెలిపినప్పటికీ సాధారణ కాన్పు పేరిట నరకం చూపించారని, తన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు పదేపదే చెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. పైగా తన కుటుంబ సభ్యులను తీవ్ర పదజాలంతో దూషించారని, కాన్పు సమయంలో తన గుండెల పైకి ఎక్క కూర్చుని సాధారణ కాన్పు పేరిట అమానవీయంగా ప్రవర్తించారని వాపోయారు. చివరి నిమిషం వరకు సిజేరియన్ నిర్ణయం తీసుకోకపోవడం కారణంగా మృత శిశువుకి జన్మనివ్వాల్సి వచ్చిందని ఆమె చెప్పారు. కేజీహెచ్ సిబ్బంది తీరుతో శారీరక హింసతోపాటు జీవితకాలం మనో వేదన మిగిల్చిందంటూ తన గోడు వెళ్లబోసుకున్నారు. తన లాంటి దుస్థితి మరో మహిళకు రాకుండా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఆ మహిళ వేదన విని చలించిన పవన్ కళ్యాణ్ ప్రభుత్వం తరపున తగిన భరోసా ఇవ్వాలని నిర్ణయించారు.



# నేడే కేంద్ర బడ్జెట్

## : వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం..

**నేడే కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్**
**రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం**
**వృద్ధికి ఊతమిస్తూనే ఆర్థిక క్రమశిక్షణ పాటించడంపై ప్రభుత్వం దృష్టి**
**ప్రధాని మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌కు 9వది**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ (ఫిబ్రవరి 1న) పార్లమెంటులో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (ఖీ27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.









# కాలం పంజా విసిరితే..!

కాలం పంజా విసిరితే
ప్రకృతి అంతా తాండవం చేస్తుంది
పంచభూతాలు పరిధి దాటి
నేలమ్మకు కన్నీళ్లు మిగిలిస్తాయి..

మంచుకొండ ఎడారికి కబురు పంపి
ఎలా బ్రతకాలో అడుగుతుంది
తన కన్నీళ్లు తానే తాగుతూ
కొండ రెక్కలు తెగిపోయి మట్టిలో కలిసింది..

జీవనదిలో జీవం ఆనవాలు లేదు
మట్టి డొక్కలో లేత ఆకు కనిపించదు
అమృతం లాంటి మన్నులో అన్నం దొరక్క
పచ్చని అడవిలో ఎండు కట్టెల బేరం కుదిరింది..

యుగాలన్నీ మోస్తూ పోతుంది కాలం
రక్తపాతాన్ని చూసి ఏడ్చింది
నేడు పచ్చని వసంతం కోల్పోయి
మనిషి మనుగడను ప్రశ్నిస్తూనే ఉంది..

మనిషి కోపం అల్పమే కావచ్చు
కాలం కళ్లు తెరిస్తే కల్పమే పోతుంది
మనిషిలోని స్వార్థపు సెగను చల్లబరచండి
గతి తప్పిన మనిషిని మేల్కొల్పండి..

- కొప్పుల ప్రసాద్
నంద్యాల
9886066235



# నేడే కేంద్ర బడ్జెట్

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (ఖీ27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

# ప్రాణ స్పందనలు

ఆ మట్టిని ముట్టుకుంటే
ప్రతి అణువు
పోరాట పాఠం బోధిస్తుంది

మూగ ఆకాశానికి తెలుసు
పచ్చని అడవి కోసం
తొడగొట్టి యుద్ధం చేసిన
ఆడబిడ్డల సంగతి

మండే సూర్యగోళానికి తెలుసు
పుట్టిన భూమి కొరకు ఉద్యమించిన
నారీమణుల దీప్తి గురించి గురించి

సమ్మక్క సారక్క గద్దెలు
మాకు యుద్ధ స్ఫూర్తి గాథలు
పరవళ్లు తొక్కే జంపన్న వాగు
అమరుల ప్రాణ స్పందనలు

మేడారం
మమ్మల్ని నిత్యం కాపాడే గుడారం
రెండేళ్లకోసారి దేశాన్ని ఏకం చేసే
శివసత్తుల పూనకం

జాతరంటే జాతరా..
తెలంగాణ నేల కుంభమేళా

ఎవరైనా అక్కడికి వెళ్ళినప్పుడు
ఆ మన్నును నొసట రాసుకోండి
అమ్మల దీవెనలతో పాటు
బ్రహ్మ రాసిన తలరాతలు మారుతాయి

అక్కడి గాలిని
ఊపిరితిత్తుల నిండా పీల్చుకోండి
పిరికితనం ఆమడ దూరం పారిపోతుంది

ఆ చెట్లను కౌగిలించుకోండి
కోటానుకోట్ల కొమ్మల ఆకులు
గిరిజనుల గర్జనలను
బుర్రకథలుగా చెబుతాయి.

- మౌనశ్రీ మల్లిక్
8919338546



# దుఃఖపు వాసన

వివస్త్రతను చేయకు హృదయాన్ని
ఆకాంక్ష నిండిన ఆశయాన్ని చేయకు ఆవిరిని

ఉబికి ఉప్పొంగుతున్న ఆ రుధిరం
ఎన్ని ఆటుపోట్లకు కొట్టుకు పోయిందో

ఎన్ని గాయాలు దిగమింగిందో
ఎన్ని ఉరికంబాల ఉచ్చులకు వేలాడిందో

ఎన్ని కన్నీటి బొట్టుల మధ్య కొట్టుకు పోయిందో
వాస్తవికతకు దర్పణం పట్టలేక ఎన్ని వేల సార్లు మరణించిందో

దుఃఖపు వాసన కాయానికి పులుముకుని
కరగని వసంతపు నీడల్లో ఒంటరి పయనం చేస్తుంటే

తాడి చెట్టులా పెరిగిన కాయం శిలలా నిల్చుందే
మొండిగా మారిన నీ హృదయాన్ని రక్తపు సెలయేటిలో ముంచు ఒకసారి

కొవ్వొత్తిలా కరిగితేనే భావికాలాన ఉన్నతి చూడగలమని తెలుసుకో
బయల్పడిన రహస్యాలను తట్టుకుంటేనే
జీవిత గమనాన్ని దాటగలమని ఎరుకుంచుకో....



- పొలగాని భాను తేజశ్రీ

# తిరుమల లడ్డు తయారీలో కల్తీ ముమ్మాటికి నిజం

**- ఒక్క శాతం కూడా మంచి నెయ్యి వాడలేదు - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**దేవుళ్ళతో పెట్టుకున్నారు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు- ఉనికి కోసమే వైసీపీ నేతల ఆరాటం**

**లోకేష్ నాయకత్వంలో అభివృద్ధిలో ముందడుగు- సూపర్ సిక్స్ అమలులో ఏపీ టాప్**

**వేగవంతమైన అభివృద్ధికి చిరునామాగా కందుకూరు**

**మీడియా సమావేశంలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి, బీద రవిచంద్ర, దివి శివరాం**

కందుకూరు,
భక్తులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ ముమ్మాటికి నిజమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. కేవలం రసాయనాలు ఉపయోగించి తయారుచేసిన కల్తి నెయ్యిని లడ్డు తయారీలో ఉపయోగించారని, కనీసం ఒక్క శాతం కూడా మంచి నెయ్యిని వాడలేదని మంత్రి తెలిపారు. సిబిఐ మరియు సిట్ దర్యాప్తులో అధికారులు ఇదే తేల్చారని అన్నారు. కందుకూరు పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శనివారం మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ అన్ని విధాలుగా దర్యాప్తు చేసి, కల్తీ నెయ్యి గుట్టు విప్పిందని మంత్రి ఆనం వెల్లడించారు. సిట్ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించిందని, కొద్దిరోజులు ఆగితే, స్కామ్ లో సూత్రధారులు ఎవరు, ఎంతెంత మింగేశారో లెక్కలు బయటికి వస్తాయన్నారు. అయితే వాస్తవాలను దాచిపెట్టి, వైసిపి పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. ఒక అబద్ధాన్ని ఎన్నిసార్లు చెప్పినా, అది ఎప్పటికీ నిజం కాదని విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.విజయనగరం జిల్లా రామతీర్థం లో రాముడి విగ్రహంతల వేరు చేయడం, అంతర్వేది మరియు కొండ బిట్రగుంటలలో స్వామివారి రథాలను తగలబెట్టడం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల బొమ్మలు మాయం కావడం వాటన్నిటిలో వైసిపి ప్రమేయం కచ్చితంగా ఉందన్నారు. దేవుళ్లతో పెట్టుకున్నారు కాబట్టి గత ఎన్నికల్లో ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారని రామనారాయణరెడ్డి చురకలు అంటించారు. రామబాణం ధాటికి వైసిపి విలవిలలాడడం గత ఎన్నికల్లో చూసామని, అయినప్పటికీ జగన్మోహన్ రెడ్డికి బుద్ధి మారలేదని ఆనం విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర నేతలను వైసీపీ నేతలు విచక్షణ రహితంగా విమర్శిస్తున్నారని, అలా మాట్లాడడానికి మీకు సిగ్గుందా అని ఆనం సూటిగా ప్రశ్నించారు. తాము కూడా అలాగే మాట్లాడగలమని, కానీ తమకు సంస్కారం అడ్డు వస్తోందని అన్నారు. ఇకనైనా నికృష్ట రాజకీయాలను జగన్మోహన్ రెడ్డి మానుకోవాలని ఆయన హెచ్చరించారు. తమ కార్యకర్తలను వదిలిపెడితే మీ సంగతి తేలుస్తారని, టిడిపి కార్యకర్తల కాలిగోటికి కూడా సరిపోరని మంత్రి వ్యాఖ్యానించారు.

**సూపర్ సిక్స్ సక్సెస్ చేసాం**

కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు అన్నింటిని దాదాపు నెరవేర్చామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాకు వెల్లడించారు. తల్లికి వందనం 11 ద్వారా తల్లుల ఖాతాల్లో ఒకేసారి 10,500 కోట్లు జమ చేశామని చెప్పారు. ఇప్పటికే మూడు విడతలుగా ఉచిత సిలిండర్లు అందించామని చెప్పారు. అన్నదాత సుఖీభవ నిధులు మూడో విడత ఫిబ్రవరి మొదటి వారంలో అందించబోతున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఏడాదికి 1140 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో 32 వేల కోట్ల రూపాయల కరెంటు చార్జీలను జనం నెత్తిన వేశారని, తాము ట్రూ అప్ చార్జీలను తగ్గిస్తున్నామని మంత్రి వివరించారు. ఏడాది 4 వేల కోట్లు తగ్గించగా, రాబోయే మూడేళ్లలో మొత్తం 30 వేల కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా చూస్తున్నామని చెప్పారు. ప్రకటించిన రోజు నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాలను పెంచి ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానిదని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 63.26 లక్షల మందికి 2,739 కోట్ల పింఛన్లు మొత్తాన్ని నెలనెలా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలో 2.2 లక్షల మందికి 95 కోట్లు, కందుకూరు నియోజకవర్గంలో 35 వేల మందికి 17 కోట్ల రూపాయల పింఛన్లు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**ఆలయాల అభివృద్ధికి చర్యలు**

రాష్ట్రంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 27 వేల ఆలయాలు



ఉన్నాయని, వాటిలో పురాతన ఆలయాలను బాగు చేయించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లాలో 150 ఆలయాల పునర్నిర్మాణానికి 1.85 కోట్లు, కందుకూరు నియోజకవర్గం లో 32 ఆలయాల కోసం 33 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 5800 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ప్రతినెల 10 వేల చొప్పున విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**వేగమైన అభివృద్ధి దిశగా కందుకూరు**

ఇప్పటివరకు అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గం ఒకటని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో ఇకనుంచి వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతంగా మారబోతుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దాదాపు లక్ష కోట్ల రూపాయలతో బిపిసిఎల్, 50 వేల కోట్ల రూపాయలతో ఇండోసోల్ ప్రాజెక్ట్, ఇంకా పోర్టు కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. వాటి వల్ల భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.

**మాలకొండ పైకి రెండో ఘాట్ రోడ్డు**

ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ దేవస్థానం పైకి రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం త్వరలోనే మొదలు కాబోతోందని మంత్రి రామనారాయణరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే అందుకోసం ప్రతిపాదనలు తయారయ్యాయని, మరో మూడు నెలల్లో నిధులు కూడా మంజూరు అవుతాయని మంత్రి చెప్పారు. కొండ పైన కొలువైన లక్ష్మీ అమ్మవారి ఆలయం పై కప్పు శిధిలావస్థకు చేరిన విషయం గురించి మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా.. నిపుణులను రప్పించి, పాత ఆలయ రూపాన్ని ఏమాత్రం మార్చకుండా త్వరలో స్లాబు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

కందుకూరు పట్టణంలో అంకమ్మ తల్లి ఆలయం గురించి మంత్రి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరిక మేరకు దేవాలయం చుట్టూ షాపుల నిర్మాణానికి అనుమతి ఇచ్చామని చెప్పారు. కొత్తగా నిర్మించిన షాపుల ద్వారా ఏడాదికి 36 లక్షల ఆదాయం వస్తుందన్నారు. అలాగే అక్కడి పూజారులకు త్వరలో క్వార్టర్స్ నిర్మిస్తామని, అందుకోసం త్వరలో 40 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని చెప్పారు. క్వార్టర్స్ నిర్మించగా మిగిలిన స్థలంలో కూడా షాపులు నిర్మించి ఆదాయం పెంచుతామన్నారు. అలాగే రాజగోపుర నిర్మాణానికి కూడా కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధుబాబు పోకూరి రాంబాబు చదలవాడ కొండయ్య, షేక్ రూబీ పాల్గొన్నారు..

# శీర్షిక : ఆరోగ్య ప్రదాతలు

ఆకు పచ్చని ఆకులు
ఆరోగ్య ప్రదాతలు...
శుభ అశుభ కార్యాల్లోనూ
ప్రముఖ పాత్ర పోషకులు....
పోషక పదార్థాల
ప్రదాయినులు....
ఆరోగ్యానికి హేతువులు...
విఘ్నేశ్వర పూజకు
కీలకాలు...
గృహాలకు తోరణాలు...
వంటలలో రారాణి...
పడతుల పాదాలకు
పారాణి...
క్రిమి కీటకాదుల
సంహారిణి...
ఆయుర్వేద ఔషధాల
తయారీలో మూలకాలు...
చర్మవ్యాధుల నయకారిణి...
చర్మ ఛాయ
మెరుగుదాయిని....
క్యాన్సర్ చికిత్సలో
ఉపయోగకారిణి...
సర్వరోగ నివారిణి...
సర్వజన క్షేమకారిణి...
హరిత వర్ణపు ఛాయని...
మధు మేహ వ్యాధి
నివారిణి....
మధ్య తరగతి ప్రజలకు
మహోపకారిణి...
కూరల్లో వాడే మమ్మల్ని తీసి
పారేయక ఆరగిస్తే
అందిస్తాయి
ఆయురారోగ్యాలను...
నిర్లక్ష్యంతో తీసి పారేస్తే
చేస్తాయి అనారోగ్య
గ్రస్తులను!!!
ఆలోచించి వాడుకోవాలి
ఆకులను!
ప్రకృతి చికిత్సలో
ముందడుగు వేస్తాయి
ఆకులు!!!



రచన : సాహితిబంధువు
డాక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు
(కమల శ్రీ)
తెనాలి, గుంటూరు జిల్లా
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము
చరవాణి : 7416638823



# ఎస్సై కట్టా అనూక్ ఆధ్వర్యంలో క్రిమినల్ చట్టాలపై అవగాహన

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 31 : మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని వగ్గంపల్లి గ్రామంలో పామూరు ఎస్సై కట్టా అనూక్ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

# దేవస్థానం డిగ్రీ కళాశాలలో విజయవంతంగా జాబ్ మేళా



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దేవస్థానం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించబడింది. ఈ జాబ్ మేళాకు వివిధ కళాశాలల నుండి మొత్తం 156 మంది అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ ఎంపిక ప్రక్రియలో వివిధ కళాశాలల నుండి 36 మంది అభ్యర్థులు, అలాగే దేవస్థానం డిగ్రీ కళాశాల నుండి 30 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 66 మందిని వివిధ ఉన్నత పోస్టులకు ఎంపిక చేశారు. ఆక్సిస్ బ్యాంకు–5, ఇసుజు –2, పానాసోనిక్ – 5, టాటా ఎలక్ట్రానిక్స్ –10, అపోలో టైర్స్ –2, డెక్కన్ కెమికల్స్ –4, ఇసన్ జు×జూవతీఅవఅఎవం–8, ూఎబఅఝుఅ – 4, గోమాత ట్రస్ట్ రాజమహేంద్రవరం – 26. నుండి ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామ్మోహన్ రావు చేతుల మీదుగా ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అభ్యర్థులను అభినందిస్తూ వారి భవిష్యత్ వృత్తి జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# లక్ష రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి అందచేత



కూకట్పల్లి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : కూకట్పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ కి చెందిన షేగురి జితేష్ రాములుకి రూ. 1,00,000/- లు మంజూరయ్యాయి. కూకట్పల్లి టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ మరియు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ఎల్ఓసి ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేసుకోగ లక్ష రూపాయలు మంజురు అయ్యాయి. ఆ చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా శనివారం కూకట్పల్లి నియోజకవర్గం శ్రీ హేమ దుర్గ భవన్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, శివకుమార్ గౌడ్, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, అస్లాం, కిట్టు, ప్రసన్న, థామస్, విజయలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి రమేష్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 21 మంది లబ్ధిదారులకు 47 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి సత్య ప్రసాద్

రేపల్లె

రేపల్లె క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 47 లక్షల విలువైన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ఎల్ ఓ సి పత్రాలను 21 మంది లబ్ధిదారులకు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ఏ సత్య ప్రసాద్ పంపిణీ చేయడం జరిగింది. రాష్ట్రంలో ప్రజలెవరూ వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడకూడదు అనే ఆలోచనతో సీఎం చంద్రబాబు సంకల్పం మేరకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఎల్ ఓ సి లు అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలబడుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.. అని మంత్రి అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మేక రామకృష్ణ కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ సాగునీటి సంఘాల చైర్మన్ పి మురళీధర్ రావు టిడిపి నాయకులు వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం సూర్య రాజు దేవగిరి రవి శంకర్ వై ధర్మతేజ జి మురహరరావు జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ ఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థి దశలో ప్రతి ఒక్కరికి లక్ష్యం ఉండాలి

**- విద్యార్థులకు పలువురు వక్తలు సూచనలు**

ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరికి నిర్దిష్టమైన గోల్ ఉండాలని ఆ దిశగా ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని ఓఎన్జిసి రాజమండ్రి చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఆర్ఎస్ రామారావు విద్యార్థులకు సూచించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి జనరల్ మేనేజర్ రామారావు, మరో జనరల్ మేనేజర్ టీవీ శేఖర్ చీఫ్ ఇంజనీర్ కిషోర్, సీనియర్ రీజనింగ్ ఫ్యాకల్టీ సంగీత ధనరాజు తదితరులు ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒకటి సాధించాలని ఆలోచనలు మదిలో మెదులుతాయని అయితే వాటిని నిర్దిష్టమైన ప్రణాళికతో సాధించాలని ఆలోచనలను అమలు చేయాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక రకమైన టాలెంట్ దాగి ఉంటుందని ఆ మేరకు వారు ఆ రంగం వైపు పైనుంచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు సూచించారు. కష్టపడితేనే దేనికైనా ఫలితం దక్కుతుందని ఆ విషయాన్ని గుర్తించి విద్యార్థి తెరచి నుంచి చదువుతోపాటు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ దిస్ గా ప్రయాణించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, పినపళ్ళ సర్పంచ్ సంగీత సుభాష్, కాలేజీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు, పలువురు నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పెన్షన్ పంపిణీలో పారదర్శకత చూపిస్తున్న కూటమి ప్రభుత్వం

**- సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ**






కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెన్షన్ పంపిణీలో పారదర్శకత కనబరుస్తోంది. ఒకరోజు కూడా పెన్షన్ ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో పెన్షన్ దారులకు ఇబ్బంది కలగకుండా సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేనుసారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుమేరకు కొత్తపేట సచివాలయం రెండు పరిధిలో టిడిపి సీనియర్ నాయకుడు గుబ్బల మూర్తి సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ప్రభుత్వ అధికారులతో కలిసి పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు పెన్షన్ దారుల కళ్ళల్లో ఆనందాన్ని చవిచూస్తున్నామని, పెన్షన్ పంపిణీలో పాల్గొనటం చాలా సంతోష దాయకమని గుబ్బల మూర్తి ఈ సందర్భంగా తెలియజేశారు

# నేడు శ్రీ లక్ష్మినరసింహా స్వామి పూజ

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 31 :



సి.యస్.పురం మండలంలో వెలసి ఉన్న ఆదిపరాశక్తి అమ్మవారి దేవాలయంలో ఆదివారం రోజు శ్రీ లక్ష్మీనరసింహస్వామి విశిష్ట పూజా కార్యక్రమం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వాహకులు షేక్ మౌలాలి, షేక్ హ నీఫాభి, షేక్ కాలేశాలి, షేక్ ఖాజాఅలీ, షేక్ మౌలాభి తెలిపారు. అదే విధంగా ప్రతీ మంగళవారం మరియు శు క్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.




# సత్యదేవుడ్ని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 :

కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని శనివారం దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా ఆలయ చైర్మన్ ఐ.వి.రోహిత్ శ్రీ స్వామివారి శేష వస్త్రమును, శ్రీ స్వామివారి ప్రసాదమును, శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దామర కృష్ణరావు, పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్, ఆలయ విభాగం అధికారి గణపతి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ పై చంద్రబాబు ఘోర అపచారాలు.. -పరిహార పూజలలు





మామిడికుదురు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 31 : తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి నేతలు చేసిన నీచమైన విష ప్రచారం పూర్తిగా అసత్యమని కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లో స్పష్టం చేయడం జరిగింది. కోర్టులో నిజాలు తెలిసినప్పటికీ ఇంకా అసత్య ప్రచారాలతో భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం అనగా 31వ తేదీ ఉదయం 10:00 గంటలకు మామిడికుదురు మండలం అప్పనపల్లి గ్రామంలో బాల బాల బాలాజీ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం జరిగింది. కలియుగ దైవం శ్రీ వెంటేశ్వర స్వామి వారు కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, జడ్పిటిసిలు, ఎంపీపీలు, తాజా మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు, నాలుగు మండల అధ్యక్షుడు కొమ్ముల రాము, యన్నాబత్తుల ఆనంద్, విత్తనాల ఇంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పుల్లేటికుర్రులో 'ఎన్టీఆర్ భరోసా' కోలాహలం

**- వృద్ధుల దీవెనలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష - టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం**

అంబాజీపేట, సింహగర్జన ప్రతినిధి జనవరి 31 : రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామంలో 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం లబ్ధిదారులతో నేరుగా ముచ్చటిస్తూ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.ఆదివారం సెలవు దినం కావడంతో అవ్వాతాతలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు ముందుగానే పింఛన్ సొమ్మును మీ చేతుల్లో పెట్టాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యమే మా మొదటి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. వికలాంగులు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, వారికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలను వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో కాలినడకన తిరుగుతూ లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. వృద్ధులు రెడ్డి సుబ్రహ్మణ్యం ఆప్యాయంగా పలకరిస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గూడాల ఫణి, రవణం రాము, పుల్లేటికుర్రు గ్రామసభ అధ్యక్ష కార్యదర్శులు పబ్బినీడి రాంబాబు దొమ్మేటి సురేష్, పెదపూడి శ్రీనివాసరావు మందా రాజేష్, మరియు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.



